# దొంగ తల్లిదండ్రులుంటారు జాగ్రత్త!




రంగనాయకమ్మ

# దొంగ తల్లిదండ్రులుంటారు జాగ్రత్త!

## రంగనాయకమ్మ

**స్వీట్ హోమ్ పబ్లికేషన్స్**
76, లేక్-సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీ హిల్స్ పోస్టు
**హైదరాబాదు - 500 033**

**దొంగ తల్లిదండ్రులుంటారు**
**జాగ్రత్త!**

పేజీలు : **408**
**[** రాయల్ సైజులో,
హార్డ్ బౌండుతో **]**

**ధర : 150 రూ.లు**

రచనా కాలం:
**2014 మార్చి నించీ**
**కొన్ని నెలల పాటు**

నవ్య వార పత్రికలో, సీరియల్‌గా,
**2014 నవంబర్ నించీ**
**2016 జనవరి వరకూ.**

పుస్తకంగా,
**మొదటి ముద్రణ:** 2016 జనవరి

ముఖచిత్రం
**చింతాడ అప్పలరాజు**

కంపోజింగ్ & పేజ్ మేకప్:
**ఎన్.రఘురామయ్య**

ముద్రణ:
**చరితా ఇంప్రెషన్స్**
1-19-1126/బి
అజామాబాదు ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు - 500 020
(ఫోన్: 040-27678411)

బైండింగ్:
**వై.వి.రెడ్డి బైండింగ్ వర్క్స్**
మూసారాంబాగ్, హైదరాబాదు - 36
(ఫోన్: 040-65162429)

ప్రతులకు:
**అరుణా పబ్లిషింగ్ హౌస్**
ఏలూరు రోడ్డు
విజయవాడ - 520 002
(ఫోన్: 0866 - 2431181)

రంగనాయకమ్మ అడ్రసు:
76, లేక్-సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గర)
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

# ముందు మాట

**త**ల్లిదండ్రులు నిర్దయులైతే, మూర్ఖులైతే, జాగ్రత్తలు పడవలసింది ఎవరు? - ఇంకెవరు? వాళ్ళ చేతుల్లో చిక్కి వున్న పిల్లలే.

చంటి పిల్లలకి కూడా ఇంట్లో రక రకాల అవమానాలు జరుగుతూ వుంటాయి. వాళ్ళు, పిల్లలు! అమాయకులు! నిర్దోషులు! చిన్న వయసుల వాళ్ళు ఎలాంటి అల్లరి చేసినా, తప్పులు చేసినా, గట్టిగా మందలించడమే చివరి శిక్ష! పిల్లలకి, అంతకు మించిన శిక్ష అమానుషం! పిల్లల్ని బాదడం, వాళ్ళని హింసించడమే కాదు, అది ఘోరంగా అవమానించడం!

అయినా, పిల్లలేం జాగ్రత్తలు పడగలరు చిన్న వయసులో? పెద్ద వాళ్ళవుతూ వున్నప్పుడే తల్లిదండ్రుల చేష్టలూ స్వభావాలూ పిల్లలు అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకుంటేనే దానికి తగిన జాగ్రత్తలతో వుండగలరు.

**ఎదిగే పిల్లలే రేపు కొత్త తల్లిదండ్రులవుతారు.**

చిన్నతనంలో, తమ తల్లిదండ్రుల వల్ల అవమానాలు పడ్డ పిల్లలు కొందరు, తామే తల్లిదండ్రులయ్యాక, తాము అనుభవించిన అవమానాలన్నీ తమ పిల్లలు కూడా పడవలసిందే అనుకుంటారు! ''మా రోజుల్లో మేం పడలేదా? మా పెద్ద వాళ్ళు మమ్మల్ని అలా చెయ్యలేదా?'' అంటారు.

టీచర్ల వల్ల క్రూరంగా దెబ్బలు తిన్న విద్యార్థుల్లో కొందరు, వాళ్ళే టీచర్లయితే, వాళ్ళు కూడా తమ విద్యార్థుల్ని క్రూరంగానే బాదుతారు. ఇంకా రక రకాలుగా హింసిస్తారు. అంటే, ''మా చిన్నప్పుడు మేం పడలేదా అవన్నీ?'' అని వాళ్ళ వాదన! అంతేగానీ, ''పెద్ద వాళ్ళ చేతుల్లో మనం పడ్డ అవమానాలు, మనం మళ్ళీ పిల్లలకు ఇచ్చి, మనం కూడా పాత వాళ్ళలాగే చెడ్డ వాళ్ళం అవుతామా?'' అనుకోరు.

ఒక తండ్రి, కొడుకు చేతిని తలుపుల మధ్య పెట్టి నొక్కేవాడు. అలాంటివి చాలా పడ్డ కొడుకు, పెద్ద వాడై, తల్లిదండ్రులతో మాట్లాడడం మానేశాడు. తండ్రిని అడిగితే, ''మా మేస్టారు మా చేతుల్ని టేబుల్‌లో పెట్టించి డెస్కు నొక్కేసేవాడు కదా?'' అన్నాడు. ''మీరూ అలాగే చేస్తారా?'' అని అడిగితే, ''ఏమో'' అన్నాడు. దీన్ని నేను ఏదో పుస్తకంలో రాశాను కూడా.

పెద్ద వాళ్ళు ఏ తప్పు చేస్తే అదే ఘన కార్యం కాదు. ఒక తరం వాళ్ళు చేసిన తప్పులు, ఇంకో తరం ద్వారా కూడా జరగకూడదు. అవి, రెండో తరంలో ఆగిపోవాలి.

దొంగ తల్లిదండ్రులూ, దొంగ అత్త మామలూ, పాత కాలం నించీ వున్నారు. ''సతీ సహగమనాల'' ముచ్చట్లు నిర్వహించిన వాళ్ళందరూ తల్లిదండ్రులూ, అత్తమామలూ, కారూ? వాళ్ళే నిలబడి ఆ క్రూర కార్యాలు చేయించారు కదా?

ఈ నాడు కూడా 'పరువు హత్యల' పేరుతో ఆడ పిల్లల్ని నరికి వేసేది తల్లి దండ్రులు కారూ?

పిల్లలు, హిమాలయ పర్వతాలెక్కే ఘన కార్యాలు చేసి డబ్బు సంపాదించా లనీ; పిల్లలు అక్కడ కొండల మధ్య రాలిపడి చచ్చినా, కొంత డబ్బు వస్తే చాలనీ; చూసే తల్లిదండ్రులు కూడా, తల్లిదండ్రులు కారూ? ఆ కొండల్లో పిల్లలకు ఏమవుతుందో అనే భయం అణువంతైనా తల్లిదండ్రులకు వుంటే, వారు దానికి ఒప్పుకుంటారా? కొండ లెక్కడంలో బోలెడు మంది పడిపోతున్నారనీ, చస్తున్నారనీ, తెలీదూ? - తెలుసు! కానీ, డబ్బు రావాలి. పిల్లలు పోతే పోతారు! - వాళ్ళే మరి తల్లిదండ్రులు!

ప్రతీ తల్లీ, ప్రతీ తండ్రీ, దొంగలు గానే ప్రవర్తిస్తారని చెప్పడమా ఇది? - కాదు. అలా చెప్పడం అయితే, నేనూ ఒక 'దొంగ తల్లి'నే అవుతాను. ప్రతీ ఒక్కరి గురించీ అదే అర్థంతో చెప్పడం కాదు ఇది.

దొంగ తల్లిదండ్రుల పిల్లలు, తమ అవమానాలన్నీ ఎప్పుడూ గుర్తు పెట్టు కోవాలి. పెద్ద వాళ్ళయ్యాక, దేన్ని సహించాలో, దేన్ని తిరస్కరించాలో, ఆ రకంగా నడవాలి. తమ ప్రవర్తనలోకి క్రూర లక్షణాలు చేరనివ్వకుండా తమని తాము దృఢ పరచుకోవాలి. - ఇదే, కొత్త తల్లిదండ్రులు తీసుకోవలిసిన జాగ్రత్త!

★ ఈ నవల, సీరియల్‌గా వచ్చినప్పుడు లేని, అక్కడ కనపడని, వేరే సంఘట నలు కూడా, ఈ పుస్తకంలో వున్నాయి. ఏ రచనలో అయినా, ఒకటి రెండు సార్లు కొత్త చేర్పులూ మార్పులూ జరుగుతూనే వుంటాయి. సీరియల్ నాటి కన్నా ఇందులో కొత్త చేర్పులు, దాదాపు 40 పేజీల వరకూ వుంటాయి.

★ "తల్లిదండ్రుల మీద ద్వేషం పుట్టించడానికి రాసిన నవల ఇది" అని కొందరు, దీన్ని గురించి భావిస్తారు. ఈ నవల, సీరియల్‌గా వస్తూ వున్న కాలంలో, "నవ్య" పత్రిక్కి అటువంటి ఉత్తరాలు కూడా వచ్చాయి. ఈ నాడు 'పరువు' పేరుతోటీ, 'చిన్న కులం మనిషిని ఇష్టపడింద'నే పేరుతోటీ, తల్లిదండ్రులే ఆడ పిల్లల్ని పీకలు నొక్కివేసి చంపే హత్యలు జరిగిపోతూ వుంటే, అటువంటి తల్లిదండ్రుల గురించి ఆ ఉత్తరాల వాళ్ళు ఏం చెపుతారు? అటువంటి వాటిని కూడా పట్టించుకోకుండా, "తల్లిదండ్రుల్ని దేవతల్లాగ పూజించాలి" అని, ఆ ఉత్తరాలు చెప్పాయి. అవి పత్రికలో అచ్చు కాలేదు. అటువంటి ఉత్తరాలు రాసిన వాళ్ళని ఎలా అర్థం చేసుకోవచ్చంటే, వాళ్ళు ఖచ్చితంగా క్రూర, దొంగ తల్లిదండ్రులే! వాళ్ళు అప్పటికే దొంగలుగా వున్న వాళ్ళే. "గుమ్మడి కాయ దొంగ" అనగానే భుజాలు తడుముకునే వాళ్ళు ఎవరు? అప్పటికే ఆ దొంగతనాలు చేసి వున్న వాళ్ళే కదా?

-రంగనాయకమ్మ, 10-12-2015 ★

# దొంగ తల్లి దండ్రులుంటారు జాగ్రత్త!

[“దొంగలుంటారు, జాగ్రత్త” అనేది అందరూ వినే ఉంటారు కదా? ఇప్పుడు, ‘దొంగ తల్లి దండ్రులుంటారు, జాగ్రత్త!” అనేది కూడా వినండి!]

**పా**ర్వతి నా పేరు. మా నాయనమ్మ ప్రేమగా పెట్టిన పేరు నాది. మా అమ్మా నాన్నా నా పేరు సంగతి అస్సలు పట్టించుకోలేదట! వాళ్ళకో పిల్ల పుట్టిందనీ, దానికో పేరు ఉండాలనీ, వాళ్ళకి తోచనే లేదు. పోనీ వాళ్ళు నన్ను ముద్దు పేర్లతో పిల్చుకుంటు న్నారా అంటే అంత భాగ్యమా నాకు? నన్ను మా నాయనమ్మకే వదిలేశారు. నాయనమ్మ నాకు ‘పెంటమ్మ’ అని పేరు పెట్టినా వాళ్ళకి అభ్యంతరం ఉండేది కాదు. పైగా వాళ్ళు సంతోషించే వాళ్ళేమో కూడా. “దాని మొహానికి పెంటమ్మ పేరే సరి పోతుంది” అనేదేమో కూడా మా అమ్మ. - అవన్నీ మా నాయనమ్మ చెప్పిన మాటలే లెండి. లేకపోతే అంత చిన్నప్పటి కబుర్లు నాకేం తెలుస్తాయి? నాకు ఏడెనిమి దేళ్ళప్పట్నించైతే మా కొంపలో ఏం జరిగాయో అన్నీ నాకూ తెలుసు గానీ, నా చిన్నప్పటి కబుర్లయితే అన్నీ మా నాయనమ్మ చెప్పినవే. అవన్నీ గుర్తే నాకు. మా నాయనమ్మ ఊరు, తూర్పు గోదావరి జిల్లాలో అన్న వరం అట. అది గుర్తే నాకు. మా నాన్నకి చదువూ సంధ్యా సరిగా లేవు. ఎలాగో అత్తెసరు మార్కుల్తో డిగ్రీ దాటాడు. ఆ మాత్రానికే ఏదో కంపెనీలో ఉద్యోగం దొరికింది అప్పట్లో.

కొన్ని నెలలు మద్రాసులో తిరిగి, ఆ తర్వాత కొత్తగూడెంలో చాలా ఏళ్ళు చేశాడు. నా చిన్నప్పుడు కొత్తగూడెంలోనే కంపెనీ క్వార్టర్స్‌లో ఉండేవాళ్ళం. మొదట్లో నా చదువు కొంత అక్కడే అయింది. అక్కడ ఒక చిన్న స్కూలూ, ఆ చుట్టూ చెట్లూ కొంచెం గుర్తే నాకు. ఆ తర్వాతైతే మా నాన్న కంపెనీ మారి అంతా హైదరాబాదులోనే.

మా అమ్మకి పుట్టింటి వాళ్ళెవరూ లేరు గానీ, మా నాన్నకి అన్నా, అక్కా ఉన్నారు. వాళ్ళని చూశాం గానీ చూసినట్టే గుర్తు లేదు. ఎప్పుడూ రారు వాళ్ళు మా నాన్న దగ్గిరికి. మా నాన్న వెళ్ళడు.

నేను పుట్టడం మా అమ్మకి అస్సలు ఇష్టం లేదు! నేను పుట్టినప్పుడు మా అమ్మకి పదహారో యేడు నిండిందంట, అంతే. మా నాన్నకైతే ముప్పయ్ దాటా యంది నాయనమ్మ. మా అమ్మది కూడా వానాకాలం చదువే. అమ్మకి పదిహేనో యేడు దాటినప్పుడు మా అమ్మ అమ్మ ఏదో జబ్బు చేసి చచ్చిపోతే మా అమ్మ నాన్న మూడో నెల దాటకుండా మూడో పెళ్ళి చేసేసు కున్నాడు. అంతకు ముందు చేసుకున్నవి రెండే రెండు పెళ్ళిళ్ళే. ఆ పెళ్ళాలిద్దరూ గబ గబా పోయారు. అవన్నీ నేను చూశానా పెట్టానా? నాయనమ్మే చెప్పింది. “పెళ్ళాలు లేకుండా మొగాళ్ళు ఉంటారా” అంది నాయనమ్మ. మొగాళ్ళకి మూడో పెళ్ళే కాదు, ఏడో పెళ్ళయినా తప్పదంది నాయనమ్మ.

మా అమ్మ నాన్నకి మూడో పెళ్ళి కాగానే ఆ మూడో పెళ్ళాం, పెళ్ళి పీటల మీద నించి లేచీ లేవ కుండానే మా అమ్మని ఇంట్లో నించి తోలెయ్యడానికి పెళ్ళి సంబంధాలు వెతకడం మొదలు పెట్టింది. అప్పుడు మా అమ్మ పుష్టిగా ఎత్తుగా ఇరవయ్యేళ్ళ పిల్లలా ఉండేది. నెల్లాళ్ళకే పెళ్ళి సంబంధం కుదిర్చేసి, మా అమ్మని మా నాన్నకి అప్పజెప్పేసి ఇల్లు ఖాళీ చేసేసుకుంది మా అమ్మ సవత్తల్లి.

మా అమ్మకి మూడో క్లాసు కన్నా చదువు లేదని విన్నప్పుడు మా నాన్న సంతోషించి, “అది చాలు, అది చాలు” అన్నాడట!

పెళ్ళయ్యాక మా అమ్మ మళ్ళీ పుట్టింటి మొహం ఎరగదు. అక్కలూ చెల్లెళ్ళూ లేరు. సవత్తల్లికి పుట్టిన వాళ్ళనీ ఎరగదు. ఎప్పుడో వాళ్ళ నాన్న పోయినప్పుడు ఒక్కసారి వెళ్ళింది గానీ అంతకన్నా ఎప్పుడూ లేదు. మా అమ్మకి పురుళ్ళూ పుణ్యాలూ అన్నీ మా నాయ నమ్మే చూసింది.

మా అమ్మ కొంచెం తెలుపు. సన్నగా పొడుగ్గా నాజూకు మనిషి. తనని, వాళ్ళ ఊళ్ళో వాళ్ళందరూ “తెల్ల పిల్ల, తెల్ల పిల్ల, అందగత్తె” అంటారని అత్త గారితో పెళ్ళి రోజు నించే, చెప్పడం మొదలు పెట్టిం దట మా అమ్మ. తను ఉన్నంత రంగు వాళ్ళ ఊళ్ళో ఎవ్వరూ ఉండరని కూడా చెప్పిందట. నన్ను “సినిమా తారలాగుంటావు అంటారండీ” - అని కూడా చెప్పే దట. రోజూ రెండు సార్లు తన రంగు మాట ఎత్తడం

మా అమ్మకి ఇప్పటికీ ఇష్టం. ఆ మాట విన్నప్పుడల్లా మా నాయనమ్మ నవ్వేది. నాయనమ్మ ఏ తెలుపూ కాదు. నలుపే కూడా.

మా నాయనమ్మంటే మా అమ్మకి ఇష్టమే. ఎందుకంటే, మొదటి సారెప్పుడో, మా అమ్మ చెప్పే రంగు మాటలు వినీ వినీ, "అవును, నువ్వు అందమైన దానివి" అందట నాయనమ్మ. అంతే, నాయనమ్మంటే మా అమ్మకి నచ్చింది. అత్తగారు నలుపూ, ఆడబిడ్డ కూడా నలుపూ, తను తెలుపూ! ఎంతో తెలుపూ! అత్త గారి కళ్ళ ముందు తను తిరగడం ఎంతో గొప్ప!

మా అమ్మకి పదహారో యేడు రాగానే పెళ్ళి అయింది గానీ, అప్పుడే పిల్లలు ఇష్టం లేదు. పిల్లలు పుడితే పాలివ్వాలనీ అందం పోతుందనీ ఎవరో అన్నారు. అయినా, అమ్మకి నచ్చకుండానే నేను కడుపులో పడిపోయాను. అది తెలిశాక నన్ను ఎలాగన్నా వెళ్ళగొట్టాలని బట్టలుతికే ఎంకమ్మ సాయంతో గచ్చాకులూ పుచ్చాకులూ చాలా మింగింది అమ్మ, అత్తగారికి తెలీకుండా. ఎన్ని మింగినా, కడుపు మీద బాదుకున్నా, నన్ను వదిలించుకోలేక పోయింది అమ్మ. అంత మొండిదాన్ని నేను. అమ్మకి కోపం! ఆఖరికి నన్ను లోకంలో పడేసింది గానీ, తను మంచం పట్టింది. అమ్మకి అదృష్ట వశాత్తూ పురిట్లో పెద్ద జబ్బు చేసింది. పిల్లకి పాలివ్వకూడదని డాక్టరమ్మ గట్టిగా చెప్పింది. అసలు డాక్టరమ్మ ఒక్క మాట చెప్పినా మా అమ్మకి చాలు గానీ, నా ఆరోగ్యం కోసం డాక్టరమ్మ ఆ మాటే మళ్ళీ మళ్ళీ చెప్తే మా అమ్మ చిరునవ్వుతో తలూపింది.

పిల్లకి పాలిచ్చే పని కూడా లేక మా అమ్మ నన్ను సుబ్బరంగా వదిలించుకుంది. ఇక నా బరువు మా నాయనమ్మ మీద పడింది. నాయనమ్మ నన్ను ముద్దుగా ఒళ్ళోకి తీసుకుంది. నా రంగు చూసి నాయనమ్మ "ఈ పిచ్చి ముండకి తల్లి రంగే వచ్చింది" అని వాళ్ళకీ వీళ్ళకీ చెప్పి నవ్వేది. నా రంగు చూసి మురిసేది.

మా అమ్మ రెండు నెలల పాటు మంచం పట్టి పట్టి అత్తగారి సపర్యలతో లేచాక నన్ను కళ్ళారా చూసి, "ఇంత నల్ల ముండ పుట్టిందా!" అని ఆశ్చర్య పోయింది!

నన్ను ఎవరే తప్పు మాట అన్నా మా నాయనమ్మకి కోపం వచ్చేస్తుంది. ఊరుకోదు. "ఏం మాట్లాడుతున్నావే సావిత్రీ? నీ కన్నా ఒక్క పిసరు రంగు తక్కువైతే అయిందేమో, అంత మాత్రాన నల్ల ముండ అంటావా చంటి ముండని? పిల్ల కడుపులో ఉండగా ఈ గడ్డీ ఆ గడ్డీ మింగితే పిల్లకి కన్ను పోతుందో కాలు పోతుందో అని ఏవన్నా జ్ఞానం ఉందా నీకసలు? ఇంకా నయం. అది నిక్షేపంగా బైటపడింది. అందుకు సంతోషించు. కడుపున పుట్టిన వాళ్ళు నల్లవాళ్ళా తెల్లవాళ్ళా అని చూస్తారా కన్నవాళ్ళు? బుద్ధి లేని దానివి కాకపోతే అలా వాగుతావా?" అని నాయనమ్మ మా అమ్మకి బాగా గడ్డి పెట్టింది ఒక సారి. ఒక్క సారి కాదు, బోలెడు సార్లు.

మా అమ్మ ఎదురు తిరిగి "మీరెన్ని చెప్పండి, ఆ దరిద్రం ముండ అసలు నా చావుకే పుట్టింది. నా ప్రాణాలు పోయేవి అసలు. పుట్టగానే దాని నోట్లో ఒక వడ్ల గింజ పడేస్తే పోయేది. నాకే బుద్ధిలేదు. మూడు నెలలు ఆస్పత్రిలో చచ్చాను" అనేది.

"మూడు నెలలంటావు, ముప్పై నెలలంటావు. రెండు వారాలు ఆస్పత్రిలో ఉన్నావు. నెల పైగా ఇంట్లో మంచం మీదున్నావు. దానికేనా మూడు నెలలంటావు? అసలు నువ్వే నీ ప్రాణాల మీదకి తెచ్చుకున్నావు. డాక్టరమ్మ ఏం చెప్పింది? కావాలంటే మళ్ళీ అడుగు. ఈ పెంటా ఆ పెంటా మింగితేనే అలా అయిందని చెప్పిందా లేదా?" అని నాయనమ్మ మళ్ళీ అనేది.

కొంపకి మా నాన్న వచ్చాక మా అమ్మ ఏడుస్తూ చెప్పుకుంటే, మా నాన్న మా నాయనమ్మ మీదకి ఎగురుకుంటూ వచ్చేవాడు. "దాన్ని తిట్టి పోశావంట ఎందుకే?" అంటాడు రాగానే. నాయనమ్మని మా నాన్న "అమ్మా" అని పిలవడు. ఏమో, ఎప్పుడున్నా పిలిచాడేమో నేను వినలేదు.

"ఆ పిల్ల ముండ నల్లగా కాకపోతే తెల్లగా మెరిసిపోతోందా? కష్టపడి కనుక్కున్నాక పుట్టే వాళ్ళు మంచి ముత్యాల్లా ఉండాలని కన్నవాళ్ళు కోరుకోరా? పిల్ల నల్లదెయ్యం అయితే తల్లి సిగ్గుతో చస్తుంది, తెలుసా? దానికి పెళ్ళెలా అవుతుందని బెంగపడొద్దూ?" అని ఎగిరెగిరి పడ్డాడు నాన్న.

మా నాన్న 'చౌకబారు ముండా కొడుక'ని మా నాయనమ్మకి బాగా తెలుసు. నాయనమ్మ ఎప్పుడూ అలాగే అంటుంది. కానీ, కొడుకు ఏదో కాస్త చదువు మిడికి, పది మంది మధ్యా ఉద్యోగం వెలగబెడుతున్నాడు. కాస్త పెద్ద వయసులో కూడా అంత పిచ్చి వాగుడు వాగుతాడనుకోలేదు నాయనమ్మ. తనూ

గట్టిగానే చెప్పింది. "నువ్వు నల్లగా పుట్టావని నేను సిగ్గుతో చచ్చానా?" అంది.

"నీ రంగుకి తగ్గట్టే నేను పుట్టాను. సిగ్గుతో ఎలా చస్తావు? ఈ పిల్ల ముండ తల్లి రంగుకి తగ్గట్టు పుట్టిందా? దీనికి పెళ్ళెలా అవుతుంది?" అన్నాడు నాన్న నవ్వు మొహంతో.

కొడుకు మాటలకి నాయనమ్మకి ఏడుపొచ్చిందట. అయినా దాన్ని ఆపుకుని కోపంగా, "తల్లి రంగేనా, తండ్రి రంగు రాదా? నీ రంగే వచ్చిందేమో. అదెందుకు అనుకోవు?" అంది. ఆ తర్వాత మళ్ళీ, "పుట్టి నెల్లాళ్ళు దాటని పిల్లముండ పెళ్ళి గురించా మీ బెంగలు? నల్లగా పుట్టే ఆడదుంటే, నల్లగా పుట్టే మగాళ్ళుండరా? నీకు తెల్ల పెళ్ళాం దొరకలేదా? దానికీ తెల్ల మొగుడు దొరుకుతాడేమో. పోనీ నల్ల వాడైనా దొరుకుతాడు. దీనికి తగ్గ వాడెక్కడో పుట్టే ఉంటాడు. పెళ్ళే కాకపోతే ఏదో పని చేసుకుంటూ అదే దర్జాగా బతుకుతుందిలే. నువ్వూ నీ పెళ్ళావూ బెంగలు పెట్టుకోకండి!" అని నాయనమ్మ గట్టిగానే చెప్పింది. మా నాన్న అప్పటికే మొహం చాటేసి గదిలోకి పోయాడు.

నా రంగు తగ్గిందని మా అమ్మ, వాళ్ళ దగ్గిరా వీళ్ళ దగ్గిరా వాపోతూ వుంటే, ఒక సారి మా మేనత్త అడిగిందట మా అమ్మని. "ఇంత తెల్లటి దానివి నువ్వు నల్లవాణ్ణి చేసుకున్నావేం?" అందట.

దానికి మా అమ్మ నవ్వి, "ఏమో , పెద్ద వాళ్ళు చేస్తే చేసుకుంటాం" అంది మొదట. ఆ తర్వాత, "మా పిన్నమ్మ ఏం చెప్పిందో తెలుసా వదినా? నేను నిజంగా మొదట కాస్సేపు గుణిశాను. మా పిన్నమ్మ ఏమందంటే, 'నీ లాగే వాడూ నీ రంగే అయితే నీ గొప్పేం ఉంటుంది వాడికి? వాడు నల్లటి వాడు కాబట్టే నిన్ను నెత్తి మీద పెట్టుకుంటాడు. ఇంక ఏ ఆడదాని వేపూ చూడడు అంది. నేను నవ్వాను. 'నా కిష్టమే పిన్నీ' అనేశాను" అందట మా అమ్మ. ఆ మాటలు మా మేనత్త మా నాయనమ్మకి చెప్తే, నాయనమ్మ నాకు చెప్పింది ఎప్పుడో. మా నాయనమ్మ ఏమందో తెలుసా? "వాడు దీన్ని నెత్తి మీద పెట్టుకుంటాడనుకుంది. దీన్ని ఎప్పుడో కాళ్ళ కింద తొక్కి వుంచాడు" అంది. నాయనమ్మకి ఎలా తెలుస్తాయో గానీ భలే మాట్లాడుతుంది.

నేను పుట్టక ముందు మా నాయనమ్మ మా నాన్న దగ్గిర ఉండేది కాదు. మా మేనత్త ఊళ్ళో, నరసాపురంలో, మేనత్త దగ్గిరే ఉండేది. అత్త పిల్లల్నే చూసేది. మా అమ్మని పురిటికి పుట్టింటికి తీసుకుపోయే వాళ్ళు లేక అప్పటి నించీ నాయనమ్మ ఇక్కడికొచ్చి ఉంటోంది. ఆఖరికి నా పెంపకం నాయనమ్మ పని అయిపోయింది. నాకు సీసాలతో పాలు తాగిస్తుంది. ఉగ్గులూ నలుగులూ స్నానాలూ అన్నీ చేస్తుంది. ఉయ్యాల్లో పడుకోబెట్టి నిద్ర పుచ్చుతుంది. ఉయ్యాలంటే, అదేం చెక్క ఉయ్యాల కాదు. ఒక పాత చీర దూలానికి వేసి నాయనమ్మ తయారు చేసిన గుడ్డ ఉయ్యాలే అది. ఉయ్యాల్లోంచి కింద పడతానేమోనని నాయనమ్మ భయపడి చెక్క ఉయ్యాల కొనమని మా వాళ్ళకి చాలా సార్లు చెప్పింది. కానీ పని జరగలేదు. నేను ఉయ్యాల్లో నిద్ర పోయాకే నాయనమ్మ నా బట్టలు ఉతికే పని పెట్టుకునేది. రాత్రుళ్ళు కూడా నా పడక నాయనమ్మ పక్కలోనే.

నాయనమ్మ నన్ను ఎప్పుడో 'పార్వతీ' అని పిలిచేసింది. అదే, పేరు పెట్టెయ్యడం అయిపోయింది. నాకు పాలు తాగిస్తూ, "తాగమ్మా పార్వతీ, అన్నీ తాగెయ్యాలి" అని బతిమాలేది. నిద్ర పుచ్చుతూ, "నిద్ర పోమ్మా పార్వతీ! నువ్వు కాస్సేపు నిద్రపోతే నేనూ నీళ్ళు పోసుకుని వచ్చేస్తాను" అనేది.

నా పేరు మా వాళ్ళు విన్నారు. వినేసి వదిలేశారు. నన్ను ఉయ్యాల్లో వెయ్యడాలూ, నామ కరణాలూ, అన్న ప్రాసనాలూ, అలాంటివేవీ లేవు. అలాంటివేవో చెయ్యమని నాయనమ్మ కూడా అడగలేదు. చెక్క ఉయ్యాలే కావాలంది. "ఎందుకూ? చీర ఉయ్యాలే బాగుందిగా? కూతురికి ఎంకమ్మ అలాగే వేస్తుంది. అందరూ అలాగే వేస్తారు" అంది అమ్మ.

అసలు నాకు ఎన్ని నెలలు దాటాయో కూడా వాళ్ళకి పట్టేది కాదు. ఆరో నెల దాటినప్పుడు, అప్పుడప్పుడూ మా నాన్న కోసం తయారయ్యే పరమాన్నంలోంచి అత్తగారికి కూడా మా అమ్మ కొంచెం అందిస్తే, అందులోంచి రెండు మెతుకులు నాయనమ్మే నా నోటికి అంటిస్తే, అదే అన్నం ముట్టించడం అయింది. అన్నీ నాయనమ్మ చేసినవే. అసలు నాయనమ్మ ఏం చేస్తోందో మా వాళ్ళకి తెలీదు, పట్టదు, చూడరు.

అసలు ఏ ఉత్సవాలూ వొద్దు గానీ, ఒక్కటి చెప్పనా? నాయనమ్మ చెప్పింది నాకు. నమ్మే వాళ్ళు నమ్మండి, మానేవాళ్ళు మానండి. నేనసలు మా అమ్మ ఒళ్ళోనో, మా నాన్న ఒళ్ళోనో, ఒక్క సారి కూడా కూర్చోలేదు. నన్ను వాళ్ళు ఎత్తుకున్నారో లేదో నాకెలా తెలుస్తుంది? "నిన్ను వాళ్ళసలు ముట్టుకోలేదు" అని

నాయనమ్మ చెప్పింది. వాళ్ళిద్దరూ పడుకునే మంచం పక్కో, మా నాన్న కూర్చునే కుర్చీ పక్కో, నేనసలు ఒక్కసారి కూడా నించోలేదు. నాయనమ్మా, నేనూ, దక్షిణం వేపు వసారాలో ఉండే వాళ్ళం. మా నివాసం అక్కడే.

నేను అమ్మ పిల్లనీ కాదు, నాన్న పిల్లనీ కాదు, నాయనమ్మ పిల్లని! నాయనమ్మ నన్ను చాలా సార్లు మా మేనత్త ఊరు తీసుకు పోయేది కూడా. చాలా రోజులు అక్కడే ఉండే వాళ్ళం. అత్తయ్యకి కూతురూ, కొడుకూ వున్నారు. వాళ్ళు కొంచెం పెద్ద వాళ్ళు నా కన్నా. కొడుకు పేరు దాసు. వాడు రెండేళ్ళే పెద్ద నా కన్నా. నా చేతిలో ఏం వున్నా వాడు లాక్కుని తినేసే వాడని నాయనమ్మ చెపుతుంది. అక్కడ అందరూ నన్ను ఎత్తుకుని తిప్పే వాళ్ళు. అక్కడి మామయ్య కూడా "అమ్మా పార్వతీ, దా, దా" అని పిల్చి ఎత్తుకుని బైట తిప్పేవాడు. ముద్దు చేసేవాడు. తల్లిదండ్రులు చచ్చిపోయిన పసిపిల్లని చూసినట్టు చూసేవాళ్ళు అక్కడ నన్ను.

మా అమ్మకి మళ్ళీ మా చెల్లెలు పుట్టే రోజు నించీ నాయనమ్మ నన్ను తీసుకుని ఇక్కడి కొచ్చేసింది. నాయనమ్మా నేనూ రాత్రింబవళ్ళూ మా దక్షిణం వసారాలోనే మసిలే వాళ్ళం. ఆ ఇంట్లో కొంచెం పెద్ద పెరడు ఉండేది. చెట్లు ఉండేవి. నాయనమ్మ నన్ను ఆ చెట్ల కింద పెట్టుకుని కూర్చునేది.

మా అమ్మ వంటింటి పని అయిందంటే చాలు, తను తినాల్సింది తినేసి, తమ గదిలోకి పోయి తలుపులు పెట్టేసుకునేది. రాత్రుళ్ళయితే, భోజనాలయ్యాక, ఆ పడుచు భార్యాభర్తలిద్దరూ (మా నాయనమ్మ అలా అనేది) గదిలోకి పోయే వారు. తెల్లారాకే బైటికి రావడం.

★★★

**నా**కు ఐదారు నెలల వయసప్పుడు, నేల మీద పాకేటప్పుడు, ఒక సారి నేను ఆ గది వేపు పాకుకుంటూ గడప కూడా దాటి వెళ్ళానట! మా అమ్మ నన్ను ఒక్క చేత్తో రెక్కపట్టి ఎత్తి గడప బైట పెట్టి, "అత్తయ్యా, దీన్ని చూడండి, ఇక్కడికి పాకుతూ వచ్చేసింది" అని అరిచింది.

నాయనమ్మ, "దాన్ని కాస్సేపు ఎత్తుకో సావిత్రీ! అది నీ దగ్గిరికి వచ్చింది కదా? నీ పక్కలో పడుకో బెట్టుకో" అంది.

"అమ్మో, నాకు అలవాటు లేదు. అసలు అది నా దగ్గిర ఉండదు. నన్ను చూస్తేనే ఏడుస్తుంది" అనేసి మా అమ్మ తలుపులు వేసేసుకుంది.

ఒక్కోసారి మా నాయనమ్మకి అనిపించేదట, నన్ను వదిలేసి వెళ్ళిపోతే, వాళ్ళే చచ్చినట్టు నన్ను చూసుకుంటారని. కానీ మళ్ళీ వాళ్ళ మీద నమ్మకం లేదు. నా మీద జాలి. నన్ను వదిలి వెళ్ళలేకపోయేది.

అప్పుడు మా ఇంట్లో, ఒక పెద్ద గదీ, చావిడీ, రెండు పక్కలా వరండాలూ, ఇంటి చుట్టూ చిన్న చిన్న పెరళ్ళూ ఉండేవి. పని బాలమ్మో ఐలమ్మో అన్నీ ఊడ్చేది. ఎప్పుడన్నా ఆ మనిషి రాకపోతే మా అమ్మ శివాలెత్తి పోయేది. ఆ మనిషి మర్నాడు రాగానే, "ఇప్పుడు మాత్రం ఎందుకొచ్చావు? పది రోజులు ఇంట్లో పడుకోకపోయావా?" అంటుంది. ఆ మనిషి కిందటి రోజు ఎందుకు రాలేదో, ఏం కష్టం వచ్చిందో, అదేమీ అడగదు. రాగానే పోట్లాట పెట్టేస్తుంది.

ఆ పని మనిషి మా అమ్మని మించి పోతుంది. "ఏంటమ్మా? తెగుళ్ళు మీకే గాని మాకు రావా? మా పనులు మాకుండవా? చెయ్యమంటావో లేదో చెప్పు!" అంటుంది ఎదరగా నిలబడి.

మా అమ్మ భయపడి పోతుంది గానీ తగ్గదు. "చేస్తే చెయ్యి, మానే మాను" అంటుంది.

ఆ పని మనిషి గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళి పోతుంది.

ఆ తర్వాత, గిన్నెలు తోమి వాకిళ్ళు ఊడ్చే పని నాయనమ్మదే. గదులు ఊడ్చే పని ఒక్కటీ అమ్మది. కానీ అమ్మ తన పని చెయ్యదు. గదులు అలాగే ఉంటాయి.

సాయంత్రం మా నాన్న వచ్చాక కాఫీ గ్లాసూ కప్పూ అందిస్తూ, మా నాన్న గ్లాసులో కాఫీని కప్పులో పోసుకుని తాగుతాడని అవి రెండూ ఇస్తూ, పని మనిషి అన్న మాటలూ, అనని మాటలూ అన్నీ, కాయించి చెప్పేస్తుంది అమ్మ. చెప్పేస్తూ ఏడుస్తుంది.

నాన్న ఎగిరిపడి, "లేబరు మూకతో పడలేం. వాళ్ళకి మింగ మెతుకు లేకపోయినా మీసాలకి సంపెంగ నూనెలు రాస్తారు. పని పోగొట్టుకోవాలంటే జంకూ గొంకూ ఉండదు. మా లాంటి వాళ్ళం ఎక్కడ ఉద్యోగం ఊడుతుందో అని రోజూ హడిలి చస్తూ ఉంటాం. సరేలే, ఇంకో దాన్ని పెట్టుకో. కాస్త వయసు మళ్ళిన దాన్ని కుదుర్చుకో ఈ సారి" అంటాడు.

"ముసిల్దయితే పనేం చేస్తుంది?" అంటుంది మా అమ్మ.

"ఎందుకు చెయ్యదూ? మా అమ్మ చెయ్యటంలా బోల్డు పనీ?" అని వాదిస్తాడు నాన్న.

మా నాన్న అనుమతితో మా అమ్మ అప్పట్నించీ కొత్త పని మనిషి కోసం వెతుకుళ్ళాటలు మొదలెడుతుంది. ఒక పని మనిషి చేస్తూ ఉండగానే ఇంకో మనిషి కోసం వెతుకుతుంది. "ఎందుకన్నా మంచిది" అంటుంది. కొత్త పని మనిషి వచ్చిందంటే, పనులు ఇంకా ఎక్కువ చెపుతుంది, జీతం తక్కువ చేస్తుంది. తప్పకపోతేనే కాస్త పెంచుతుంది. ఆ కొత్త పని మనిషి మహా అయితే నాలుగైదు నెలలు ఆగుతుంది. మళ్ళీ సరికొత్త మనిషి కోసం వెతకాల్సిందే. నా చిన్నప్పుడు ఏడాది లోపల ఏడుగురు పని మనుషులు మారారని చెప్పింది మా నాయనమ్మ.

నాకు ఐదారేళ్ళ వయసప్పుడు ఒక సారి మా పక్కింట్లో రుక్మిణత్తయ్య గారింటికి పంచదార అప్పు కోసం మా అమ్మ ఇచ్చిన గ్లాసు పట్టుకుని వెళ్ళాను. వాళ్ళ వాకిట్లో చెట్ల కింద ఒక కోడి పెట్ట చిట్టి చిట్టి పిల్లల్ని తన పొట్ట కింద పెట్టేసుకుని నేలకి అంటుకుపోయి కూర్చుని ఉంది. అలాంటిది నేనెప్పుడూ చూడలేదు. మా వాకిట్లో కోళ్ళే ఉండవు. నేను అదే చూస్తూ పంచదార అడగడం మర్చేపోయాను. రుక్మిణత్తయ్యే నా చేతుల్లో గ్లాసు చూసి ఎందుకని అడిగి, గబ గబా పంచదార పోసి ఇచ్చింది. నేను ఇంకా ఆ కోడినే చూస్తూ ఉంటే, అత్తయ్య అప్పుడు చెప్పింది. "ఇందాక గద్దో ఏదో ఆకాశం మీద తిరిగింది. నేను చూడనే లేదు. ఇది కనిపెట్టేసింది. ఇటూ అటూ తిరుగుతున్నాయి దాని పిల్లలు. వాటిని పిల్చేసింది కొక్కొక్కోమని. అవన్నీ ఎగురుకుంటూ వచ్చి తల్లి కడుపు కింద దూరిపోయాయి. జంతువులూ పిట్టలూ అలాగే చేస్తాయి పార్వతీ. మనుషులకే బుద్ధి ఉండదు. తల్లి అయితే పిల్లల్ని అలాగే కావిలించుకుంటుంది" అని మళ్ళీ మళ్ళీ చెప్పింది.

అప్పుడు నాకు ఐదారేళ్ళే. రుక్మిణత్తయ్య తప్పు చెపుతోందనుకున్నాను. "అత్తయ్యా, ఆ కోడి, అమ్మ కాదు, నాయనమ్మే. అది నాయనమ్మ కోడి. నాయనమ్మే అలా పెట్టుకుంటుంది. ఛీ ఛీ, అమ్మ అలా పెట్టుకోదు" అన్నాను.

రుక్మిణత్తయ్య నా వేపు ఎలా చూసిందంటే, నన్ను దగ్గిరికి తీసుకుంది. "అవును, నాయనమ్మేనేమో ఆ కోడి. అమ్మేమో అనుకున్నాను. సరే, నువ్వు తొందరగా వెళ్ళు, అమ్మ కేకలేస్తుంది. గ్లాసు గట్టిగా పట్టుకో" అంది.

నేను ఇంటికి వచ్చి మా నాయనమ్మతో చెప్పాను, "నాయనమ్మా, వాళ్ళింట్లో ఒక నాయనమ్మ కోడి ఇన్ని పిల్లల్ని పొట్ట కింద పెట్టేసుకుని కూర్చుంది. బలే కూర్చుంది" అన్నాను.

నాయనమ్మ మళ్ళీ మళ్ళీ అడిగి నవ్వింది. "పిచ్చి ముండా! పిట్టల్లో నాయనమ్మ కనపడిందా నీకు? వాళ్ళు దాన్ని ఎప్పుడో తినేసి ఉంటారు" అంది.

నాకు అర్థమే కాలేదు. నాయనమ్మ రుక్మిణత్తయ్యని తిట్టిందని నా కనిపించింది. "నాయనమ్మా, రుక్మిణత్తయ్య మంచిది. నాయనమ్మ కోడి అక్కడే ఉంది. దాన్ని తినలేదు" అన్నాను.

నాయనమ్మ నన్ను ఆ కోడిలాగే దగ్గిరికి తీసుకుంది.

★ ★ ★

**నా**కు తెలియని నా పసితనం, నాయనమ్మ ఒళ్ళో ఐదేళ్ళ దాకా నిశ్చింతగా సాగింది. పిల్లల్ని తల్లిదండ్రులు పెంచుతారని, పెద్దయ్యాక ఎవరెవర్నో చూసే దాకా నాకు తెలీదు. నాయనమ్మలే పెంచుతారనుకునే దాన్ని.

ఇప్పుడు నేను నాయనమ్మ ఒళ్ళో ఆడుకుంటూ ఉన్న చిన్న పార్వతిని కాను. బియ్యే, బియ్యీడీలు చేసి, తర్వాత ఎమ్మే చేసి పిల్లలకి చదువులు చెపుతోన్న పంతులమ్మని. ముప్ఫై నాలుగేళ్ళు దాటినా, చిన్నప్పటి జ్ఞాపకాల్లో ఒక్కటి కూడా మర్చిపోని పెద్ద పార్వతిని. ఈ నాటికీ నాయనమ్మతో కలిసి బతుకుతోన్న పార్వతిని. నేను ఇది చెప్పేది 2012వ సంవత్సరంలో.

చిన్నప్పుడు నాకు నాయనమ్మ రోజూ ఏం చెప్పేదంటే, "చదువుకో అమ్మా! అత్తయ్య కూతురు చదువుకుంటోంది. ఆడ పిల్లలందరూ చదువుకుంటున్నారు. ఏదో చిన్న పని చేసుకుని బతుకుదువు గానీ, చదువుకో అమ్మా!" అని చెప్పేది. ఆ మాటలు ఎప్పుడూ? నాకు సీసాతో పాలు పట్టేటప్పుడు! కాళ్ళ మీద పడుకోబెట్టుకుని నీళ్ళు పోసేటప్పుడు! ఉయ్యాల్లో జోకొట్టి నిద్ర పుచ్చేటప్పుడు!

నాకు నాలుగేళ్ళప్పుడు మా నాయనమ్మ ఒళ్ళోకి నా పక్కన సరస్వతి కూడా చేరింది. అది నా చెల్లెలే. సరస్వతి కూడా మా అమ్మకి నచ్చలేదు. అది నా కన్నా తెల్లగా ఉందని మా అమ్మకి కొంత నచ్చకపోలేదు.

కానీ, అది తన కన్నా తెల్లగా ఉందని మా అమ్మకి అంతగా నచ్చలేదు. అలా అని మా అమ్మ నోరు తెరిచి చెప్పిందని కాదు. చెప్పక పోయినా, మా అమ్మ బుద్ధి నాయనమ్మ బాగా కనిపెట్టేది ప్రతి దానికీ.

ఒక సారి మా అమ్మ నాయనమ్మతో, "ఈ చిన్న దన్నా నా పరువు కాపాడింది లెండి. అయినా ఇది మరీ పిచ్చి తెలుపు" అంది, తనేం చెపుతోందో అర్ధం కానివ్వకుండా. కానీ, నాయనమ్మకి అన్నీ అర్ధమవు తాయి. "చిన్నది నీ పరువు కాపాడిందిలే గానీ, నీ పరువు తీసింది కూడాలే. ఇది నీ కన్నా మంచి రంగు. దీన్నే 'తెల్ల పిల్ల, తెల్ల పిల్ల' అనాలి. పెద్ద దానికి తెలుపు తగ్గిందని పెళ్ళే కాదన్నారు. తళ తళ లాడే ఈ చిన్న దానికి ఇద్దరు మొగుళ్ళని తెచ్చి కట్టండి! వెతకండి ఇప్పట్నించే" అంది నాయనమ్మ.

మా అమ్మ ఏడవలేక నవ్వి, "కాస్త తెల్ల రంగే గొప్ప కాదులెండి. ముక్కూ మొహం తీరుగా ఉండొద్దూ? దీని ముక్కు చూడండి, బానంత ఉంది. నా ముక్కులా దీని ముక్కు కోటేరు దిద్దినట్టుందా?" అంది. అందచందాల్లో తనతో ఏ కూతురూ సరిపోదని తేల్చింది.

"సావిత్రీ! నీకు ఇరవయ్యేళ్ళు దాటినా బుద్ధి రాలేదే. పిల్లల్ని కడుపులో పెట్టుకోవాలని తెలీని తల్లివి నువ్వు. కోళ్ళూ కుక్కలూ కూడా పిల్లల్ని పొట్ట కింద దాచుకుంటాయి" అంది నాయనమ్మ కోపంగా.

అత్తగారు తేలిగ్గా మందలించినా, కోపంగా తిట్టినా, మా అమ్మ పట్టించుకోదు. ఒక నవ్వు నవ్వేసి వదిలేస్తుంది. అత్తగారు కొంచెం మాట తప్పని రకం అనీ, ఒళ్ళు మండితే వెళ్ళిపోతానంటుందేమోననీ, మా అమ్మ భయపడుతూనే ఉంటుంది. అత్తగారు ఉండ డమే మా అమ్మకి ఇష్టం.

మా చెల్లెలు పుట్టాక కొన్నాళ్ళ దాకా ఇరుగులూ పొరుగులూ వచ్చి ఒక చొక్కా గుడ్డో, సబ్బు బిళ్ళో ఇచ్చి వెళ్తూనే ఉన్నారు. వచ్చిన వాళ్ళు మొదట "చిన్నది ఎంత బాగుందో" అంటారు.

మా అమ్మ, చిన్న దాన్ని తనే తెలివిగా ఆ రంగుతో తయారు చేసినట్టు గర్వపడుతుంది. తర్వాత వినయం చూపిస్తుంది. "ఎలా రాసిపెట్టి ఉంటే అలా పుడతా రండీ. అందం చందం లేనిదీ పుట్టింది, కాస్తో కూస్తో అంద చందాలున్నదీ పుట్టింది. కన్న కడుపుకి ఎలా పుట్టినా పెంచక తప్పదు కదండీ?" అంటుంది.

ఆ వినేవాళ్ళు, "అంతే మరీ. పిల్లల్ని మన చేతుల్తో మనం చేసుకుంటామా? నీ కూతుళ్ళిద్దరూ ముత్యాలే సావిత్రీ" అంటారు. మా సావిత్రి, "అంత మాట అనొద్దులెండి. ఉన్నది ఉన్నట్టే చెప్పుకోవాలి. చిన్న దాని అందం పెద్ద దానికెక్కడుందీ?" అంటుంది.

ఆ మాటలన్నీ, మా నాయనమ్మ గడ్డి పెట్టిన తర్వాతే. ఐదేళ్ళ నేను వాళ్ళ పక్కన నించుని ఉన్న ప్పుడే! నా మొహం ముందే! అప్పటికి నాకు మాటలన్నీ బాగానే అర్ధమవుతున్నప్పుడే!

ఇరుగు పొరుగు వాళ్ళందరూ మంచి వాళ్ళే గానీ, రుక్మిణత్తయ్య అందరి కన్నా మంచిది. మా అమ్మ కన్నా కొంచెం పెద్దావిడ. మా అమ్మని మందలిస్తూ ఉండేది. "తప్పు సావిత్రీ, అలా అనొద్దు. పదహారేళ్ళు దాటే దాకా రూపు రేఖలు బైటపడవసలు. పదేళ్ళు పోతే ఎవరి పోలికలెలా మారతాయో కనిపెట్టలేం" అనేది ఎప్పుడూ. అప్పుడు మా అమ్మ ఏమీ మాట్లాడలేక పోయేది ఆవిడి ముందు.

మా చెల్లెలి పేరు మా నాన్నే పెట్టాడు, 'సరస్వతి' అని. "ఈ ముండ బాగా చదువుతుంది" అన్నాడు. "దీని రంగు చూసేసి దీన్ని అన్ని క్లాసుల్లోనూ పాస్ చేసేస్తారు" అన్నాడు. అంత అందగత్తెకి కూడా ఉయ్యాల ఉత్సవాలూ, నామకరణాలూ, అన్నప్రాస నాలూ, ఏమీ లేవు. నేను దిగిన పాత కోక ఉయ్యాలే అది ఎక్కింది. అది బాగా బరువు నా కన్నా. పాత కోక ఫర్రుమని చిరిగితే, నాయనమ్మ నిద్రలో ఉలిక్కిపడి లేచి, కొత్త పాత చీరతో కొత్త ఉయ్యాల తనే తయారు చేసింది. చెక్క ఉయ్యాల మాట మళ్ళీ ఎత్తలేదు నాయనమ్మ.

మా నాయనమ్మకి పని పెరిగింది. నాలుగేళ్ళు నిండిన నన్ను ఎప్పుడూ పక్కన కూర్చోబెట్టుకుని, చిన్న దాన్ని ఒళ్ళో పడుకోబెట్టుకునేది. మా అమ్మ పని అంతా, చిన్న దానికి పాలివ్వడం ఒక్కటే. ఆ పని అయ్యాక దాన్ని తెచ్చి అత్త గారి దగ్గిర పడేసేది. మా నాయనమ్మ చంటి పిల్లల పనులంటే విసుక్కునేది కాదు. పిల్లల్ని ముద్దుగా చూసేది. పిల్లలతో గడప డానికి సంతోషపడేది. మా నాయనమ్మకి అప్పుడు మరీ వృద్ధాప్యం కాదు. ఏ అనారోగ్యాలూ ఉండేవి కాదు. మా మేనత్త ఇంట్లోనూ పిల్లల పెంపకమే. పిల్లలతో మాటలే మనసుకి ఆరోగ్యం అంటుంది. మా అమ్మ నడతకే చాలా విచారించేది. మా నాన్నని అయితే అసలు మనిషి లాగ జమకట్టేది కాదు. మాట్లా డుతూ మాట్లాడుతూనే ఏడ్చేది.

పిల్లల్ని ముద్దుగా చూసుకోవాలని బతిమాలి చెప్పినా, మందలించి చెప్పినా, ఎలా చెప్పినా, మా అమ్మ చెవిన పెట్టేది కాదు. మా పనులు చేసేది కాదు. మా నాయనమ్మ మమ్మల్ని వదిలెయ్యలేకపోయింది.

సరస్వతి, నాయనమ్మ ఒళ్ళో కూర్చున్నప్పుడు, పక్కనే ఉన్న నా జుట్టు గుప్పిళ్ళతో పట్టేసి పీకేది. నన్ను చేతుల్తో తోసేది. కాళ్ళతో తన్నేది. దానికి ఆటలాగ ఉండేది అదంతా.

నాయనమ్మ నవ్వి, "ఇదుగో అక్కని తోశావంటే నిన్ను దింపేస్తా. మీ అమ్మ దగ్గిరికి పంపెయ్యనా నిన్ను?" అని సరసుని బెదిరిస్తే, నిజంగా సరసు చప్పున ఆగేది. "అమ్మకి ఇచ్చెయ్యనా?" అంటే, "దెయ్యానికి ఇచ్చెయ్యనా?" అని దానికి అర్థమయ్యే దేమో, కదలకుండా కూర్చునేది కాస్సేపు. అంతలోనే నాయనమ్మ బెదిరింపు మర్చిపోయి, మళ్ళీ నా జుట్టు పట్టేసేది.

నాయనమ్మ బాగా నవ్వి, "అమ్మో, ఇది గడుసు ముండ అయ్యేలా ఉందే" అనేది. మళ్ళీ వెంటనే, "పాపం, అల్లరి ముండ, అంతే" అనేది.

నాయనమ్మ ఎన్నెన్ని కబుర్లు చెప్పిందో! అన్నీ గుర్తు లేవు నిజంగా.

ఒక రోజు ఏమైందంటే, పని బాలమ్మ రాలేదు. మా అమ్మ రుస రుస లాడి పోతోంది. మా నాయనమ్మే గిన్నెలన్నీ తోమి వాకిళ్ళు ఊడుస్తోంది. మా గుడ్డలన్నీ నాయనమ్మ ఎలాగూ ఉతుకుతుంది. మా అమ్మకి మిగిలే పని గదులు ఊడ్చుకోవడమే. ఆ వంట తప్ప రెండో పనంటే ప్రాణం పోతుంది మా అమ్మకి.

చెప్పాలంటే, ఆ వంట పని కొంచెం ఎక్కువే. మా నాన్న కోసం చేసే వంటలు ఇన్నీ అన్నీ కావు. తెల్లార గట్ల అడుగు ఎత్తు కాఫీ గ్లాసుతో మొదలవుతాయి, భర్త గారికి మా అమ్మ సపర్యలు. ఆ కాఫీ గ్లాసుతో పాటు కప్పు కూడా తేవడం మర్చిపోయిందంటే, అయిందే మా అమ్మ పెళ్ళి! ఆ పెళ్ళి ఇద్దరికీ కలిసి కాదు. భర్తకి సేవల్లో లోటు చేసిన భార్యకి ఒక్క దానికే. "కప్పేదీ? అంత మతిమరుపా లంజముండా!" అనేస్తాడు. మా అమ్మ పైకి మాత్రం నవ్వుతుంది. "అయ్యో, తెస్తానుండండి" అంటూ లోపలికి వెళ్ళి చప్పున వస్తుంది. ఒక సారైతే ఆ కప్పు తెచ్చే కంగా రులో, మా నాన్నకి చాలా గొప్పగా నచ్చే ఖరీదైన కప్పు మా అమ్మ చేతుల్లో నించి కిందపడిపోయింది. అది దట్టమైన చప్పుళ్ళతో పదహారు చెక్కలైపోయింది. మా నాన్న ఆవేశంగా లేచి వచ్చేశాడు. జరిగిన ఘోర నేరం కళ్ళారా చూశాడు. అందగత్తె చెంప మీద ఒక్కటి పెట్టాడు. "లంజ ముండా! దేన్నీ గట్టిగా పట్టుకోవు. దేనికీ ఒళ్ళొంగనివ్వవు. గిన్నెలు పడేస్తావు, చెంబులు పడేస్తావు. ఆఖరికి జపాన్ కప్పు కూడా పొట్టన బెట్టు కున్నావా!" అంటూ ఆగ్రహంతో ఊగిపోతోంటే, ఆ కేకలకి మా నాయనమ్మ లేచింది. నాయనమ్మని చూడగానే మా నాన్న లోపలికి వెళ్ళిపోయాడు. మా నాన్న మీద ఎంతో కొంత నాయనమ్మ భయం ఉంటుంది. ఆ దన్ను దొరుకుతుందని కూడా మా అమ్మకి మా నాయనమ్మ ఉండడం ఇష్టం.

మా అమ్మ, భర్త గారికి చెయ్యవలసిన జాబితా చెపుతున్నాను కదా? కాఫీ అందించాక అరగంట దాటగానే, అట్లో ఉప్మాలో వెండి ప్లేటుతో అందిం చాలి. దానితో ఏం పచ్చడి కావాలో కిందటి రోజు తనే చెపుతాడు. ఆ అట్లూ పచ్చడీ వెండి పళ్ళెంలో గాక స్టీలు పళ్ళెంతో ఇచ్చిందంటే, అయిందే రెండో సారి పెళ్ళి! ఒప్పుకోడు. వెండి దానిలోకే మార్చి తీసుకు రమ్మంటాడు. ఇంట్లో వెండివి రెండు ప్లేట్లే. ఒక అన్నం పళ్ళెం కూడా. అవి, 'నాన్న గారికే' అంటుంది మా అమ్మ. అవి ఖాళీగా ఉన్నా, నాన్న గారు ఇంట్లో లేక పోయినా, వాటిల్లో నాయనమ్మ కూడా తినకూడదు. అవి, నాన్న గారికి, పెళ్ళప్పుడు అత్త గారిచ్చిన కానుకలు. అవి, ఆ మనిషివే. వాటిల్లో తినాలని నాకు సరదాగా ఉండేది. అడిగినప్పుడల్లా మా అమ్మ, "అమ్మో, అవి నాన్న గారివి. వాటిల్లో నేనే తినను" అంటుంది . ఏడు గంటల అల్పాహారం అయ్యాక, ఇంకో గంటకి, ఇంకో వెండి గ్లాసుతో హార్లిక్సు ఇవ్వాలి కొంచెం పల్చగా. హార్లిక్సు పొడి భలే పరిమళంగా ఉంటుంది. అది కొంచెం పెట్టమని మా అమ్మ ముందు ఒక సారి చెయ్యి చాపాను.

"అమ్మో, నాన్న గారు తిడతారు. ఆఫీసులో కష్టపడి పని చేసుకునే మనిషికి అవన్నీ ఉండాలి గానీ, ఇంట్లో ఉండే వాళ్ళం మనకెందుకూ?" అంది మా అమ్మ.

"కొంచెం పెట్టు, కొంచెమే పెట్టు, చూస్తా" అని నేను వెంటబడ్డానట, మా నాయనమ్మ చెప్పింది. అప్పుడు మా అమ్మ హార్లిక్సు సీసాలో గుచ్చి తీసిన చెంచా ఇచ్చి, "ఇది చీకి కడిగి పెట్టెయ్యి" అందట!

నేను సంబరంగా ఆ చెంచా చీకి చీకి చీకి దాన్ని కడగాల్సిన అవసరం లేకుండా చేసేస్తోంటే, మా నాయ

నమ్మ దాన్ని లాక్కుని కడిగేసి, వంటింట్లో నేల మీదకి విసిరేసి నన్ను వసారాలోకి లాక్కుపోయి, "పిచ్చి ముండా! ఈ సారి అలా అడిగావంటే చూడు, చంపుతా" అని తిట్టింది నన్ను.

"నాన్న గారికే అని చెపుతుంది గానీ, ఏది చేసినా తనూ తింటుంది, తనూ తాగుతుంది. పసి ముండ అడిగితే ఇవ్వడానికి నాన్న గారు తిడతారా? వాడు తిట్టే మాట నిజమే. వాడికి చెప్పి ఇవ్వాలా? వాడికి తెలీ కుండా ఇవ్వరాదూ? పిల్లకి పెట్టొద్దా అని వాడితో పోట్లాడరాదూ? ఇంకెప్పుడూ అడక్కు సుమా!" అని మళ్ళీ తిట్టింది నాయనమ్మ.

నాయనమ్మ తిడితే, అంత చిన్నప్పుడు కూడా నేను చెప్పినట్టు వినేదాన్ని.

నాన్న గారికి హార్లిక్సు తీర్థం అయిపోయాక పది గంటలప్పుడు, ఆఫీసులో కష్టపడి పోయే మొగాడికి భోజనం! అది పెద్ద వెండి పళ్ళెంలో. రోటి పచ్చడీ, వేపుడు ముక్కలూ, పప్పుచారూ, అప్పటికి తయారై పోవాల్సిందే. తర్వాత ఆఫీసులో తినడానికి చిన్న చిన్న డబ్బాల్లో కూడా ఏవో సర్ది నొక్కి నొక్కి ఇస్తుంది. సాయంత్రం ఇంటికొచ్చేప్పటికి వీధి గుమ్మంలోనే టీ గ్లాసూ, పింగాణీ కప్పూ, అందించాలి ట్రేలో పెట్టి. ఆ తర్వాత వెండి గిన్నెల్లో మైసూరు పాకం ముక్కో, చేగోడీలో, కారప్పూసో, నిండా పెట్టి ఇవ్వాలి. రాత్రి భోజనం దగ్గర, ఏదైనా కొత్త వేపుడు ముక్కలు ఉండాలి. అప్పడాలు రాత్రి భోజనంలో తప్పకుండా ఉండాలి. అప్పడాలు, కొనేవి పనికి రావు. ఇంట్లో చేసేవే ఉండాలి. అప్పడాల్లో సీమ మిరపకాయల కారం వేసి చెయ్యాలి. అవి ఇంగువ వేసినవి కాకపోతే, మా అమ్మకి అయిందే మూడో పెళ్ళి! ఇక పడుకో బోయే ముందు గ్లాసుడు పాలూ, ఒకటో రెండో అరిటి పళ్ళూ! గంట గంటకీ ఏది కావాలో అది సిద్ధం చెయ్యాల్సిందే! ఆ మనిషి ఇంట్లో ఉన్నంత సేపూ ఆ మనిషి చుట్టూ తిరగాల్సిందే. ఆ మనిషి లేనప్పుడు, వచ్చేప్పటికి హాజరుపర్చవలసినవి తయారు చేసు కుంటూ ఉండాలి. ఆదివారాలప్పుడూ సెలవు లప్పుడూ ఇంట్లో ఉన్నాడంటే, ఏవైనా కొత్త వంటకం కావాలి. పాత చేగోడీలో, కారప్పూసో పెడితే, "రోజూ ఒక్కటేనా, గడ్డి తిన్నట్టు?" అంటాడు.

మా నాన్న తినేదీ, తాగేదీ, ఎలా వుంటాయో మళ్ళీ చెప్తే, చీకట్నే కాఫీ + తెల్లారాక ఏదో ఒక టిఫిను + పది గంటలకు ఫుల్ భోజనం + మధ్యాన్నం కొంత టిఫినూ, పళ్ళూ + ఆఫీసులోనే రెండు మూడు టీలు + ఇంటికి రాగానే టీ, టిఫినూ + రాత్రి వేపుడు ముక్కల భోజనం + చివరికి పాలూ, అరిటి పళ్ళూ - ఇదంతా ఒక రోజులో సింపుల్ ఆహారం! పండగ రోజులైతే, గారెలూ, చక్కెర పొంగలీ వంటివి కూడా కలుస్తాయి.

మా నాయనమ్మ ఏమనేదంటే, "అన్నీ ఇదే నేర్పింది వాడికి. చిన్నప్పుడు వాడికి ఇన్ని తిళ్ళు ఉన్నాయా? ఈవిడ వచ్చినప్పట్నించీ మొగుడికి గంట గంటకీ ఫలహారాలందించేస్తే వల్లో పడిపోతాడను కుంది. హార్లిక్సు సీసా తనే మొదట కొనుక్కొచ్చి ఇవ్వడం మొదలెట్టింది. "రెండు కూరలేనా" అని మూడో కూర మొదలెట్టింది. 'రాత్రి పూట మరోటి చేస్తాను' అని అదీ మొదలెట్టింది. ఏదో పుస్తకం కొని చదవడం బాగా రాకపోయినా కొత్త కొత్త వంటకాలని అరిటి పళ్ళు పిసికి వడలూ, పుచ్చకాయి రుబ్బి హల్వాలూ, అబ్బబ్బ... అంతా దీని పనే. మొదట్లో వాడు 'ఇంత ఖర్చెందుకూ' అనేవాడు నిజంగా. కానీ, రుచులికి అలవాటు పడ్డాడు. 'మీ ఒక్కరి కోసమే చేస్తున్నాలెండి, మీరు తింటే నాకు సంతోషం' అంటుంది. అలా గంట గంటకీ కూరిపెడితే తనని నెత్తి మీద పెట్టుకుంటాడనుకుంది. కిందకి దింపడను కుంది. వాడా? ఆ అందగత్తెని, తళ తళ లాడే చెంపల మీద రోజుకో లెంపకాయ వెయ్యకపోతే పెళ్ళాన్ని అదుపులో పెట్టడం తెలీని వాణ్ణి అనుకుంటాడు. వాళ్ళిద్దరికీ సరిపోతుందిలేమ్మా, సరిపోతుంది, వాడు తన్నకపోతే మొగాడే కాడనుకుంటుంది ఇది. ఇద్దరికీ సరిపోతుంది" అని మా నాయనమ్మ నాకు తెగ చెప్పేది నాకు ఐదారేళ్ళప్పుడు!

★★★

ఒక రోజు మా నాన్న మధ్యాన్నం నిద్రలేచి "సగ్గు బియ్యం పాయసం ఉందా?" అన్నాడు.

మా అమ్మ కంగారుపడి, "అదేవిటి, మీరు చెప్ప లేదుగా? పరమాన్నమే చేశాను" అంది.

"అదొద్దు, పోనీ ఇస్తే కొంచెం ఇయ్యి. సగ్గు బియ్యంతో చెయ్యి! సేమ్యా కూడా కలుపు! ఒక గంటలో అవుతుందా?" అన్నాడు. "గంట దాకా ఎందుకూ? మీ పత్రిక లేవో వచ్చాయి. చూస్తూ ఉండండి, తెచ్చేస్తాను" అనేసి వంటింట్లోకి గబ గబా వచ్చి సీసాలు వెతికింది. సగ్గు బియ్యం లేవు!

పరిగెత్తినట్టు రుక్మిణత్తయ్య గారింటికెళ్ళి ఒక గ్లాసుడు సగ్గు బియ్యం అప్పు తెచ్చింది.

నాయనమ్మ నన్ను వెంట బెట్టుకుని కొట్టుకి పోయి సగ్గుబియ్యం కొనుక్కొచ్చింది. "తర్వాత ఆవిడికి అప్పు తీర్చెయ్యి తొందరగా. లేకపోతే మర్చిపోతావు" అంది అమ్మతో.

"ఫర్వాలేదులెండి. మర్చిపోయినా ఆవిడేవీ అనుకోదు" అంటూ సగ్గు బియ్యం పాయసం జీడిపప్పులతో, యాలకు గింజలతో, ఇల్లంతా ఘుమ ఘుమలాడేలాగ తయారు చేసింది.

ఎంత సేపటికీ మాకు పెట్టదే! కాస్సేపు చూసి నాయనమ్మ అడిగింది, "పిల్లలకి పాయసం పొయ్యి కొంచెం తాగిస్తాను" అంది. నన్ను వంటింట్లోకి పంపింది. "అమ్మ నడిగి పాయసం తీసుకురా" అని. నేను వెళ్ళి గుమ్మం దగ్గిర నించున్నాను. మా అమ్మ పాయసం గిన్ని దోసిలితో గబ గబా నాకుతోంది. "నాన్న గారికే చేశాను. మనందరికీ చెయ్యలేదు. నాన్న గారికి ఇచ్చేశాగా? గిన్ని కడిగేద్దామని తుడుస్తున్నాను" అని గిన్నెలోంచి ఇంకా తీసి తీసి తింటూనే ఉంది.

నేను ఏడుస్తూ నాయనమ్మ దగ్గిరికి వచ్చేశాను. నాయనమ్మకి ఎంత కోపం వచ్చిందో! నెత్తి బాదుకుంది. "మీ అమ్మ ముండే వాణ్ణి అలా తయారు చేసింది. వాడికి కాస్త పడేసి తను మిగతాది మింగుతుంది. ఛీఛీ దీనికి పిల్లల్నెలా ఇచ్చాడో దేవుడు ముండా కొడుకు!" అని నాయనమ్మ మా అమ్మనీ, నాన్ననీ, దేవుణ్ణీ, అందర్నీ తిట్టిపోసింది మా దగ్గిర. వాళ్ళ ముందూ తిడుతూనే ఉంటుంది గానీ, "వాళ్ళ నోట్లో నోరెట్టి లాభం లేదు, దండగ" అంటుంది.

మా అమ్మకి ఏం జ్ఞాపకం వచ్చిందో, గిన్నితో ఏదో తెచ్చింది. "అసలు పరమాన్నం చేస్తే వద్దన్నారు. అన్నారు గానీ తిన్నార్లెండి కొంచెం మిగిలింది. పిల్లలకెందుకూ, వాళ్ళు మధ్యాన్నం అన్నాలు తిన్నారుగా? మీరు తినండి అత్తయ్యా పరమాన్నం" అని ఆ గిన్ని అక్కడ పెట్టేసి పోయింది. అప్పుడప్పుడూ అత్తగార్ని బుట్టలో వెయ్యడానికి ఏవేవో ఇస్తూ ఉంటుంది. అత్తగారు బుట్టలకీ తట్టలకీ ఇముడుతుందో లేదో తెలుసుకునే తెలివి ఆ అందగత్తె కోడలికి ఉంటే కదా?

మా నాయనమ్మ ఆ పరమాన్నం చూసి సంతోషించి మా ఇద్దరికీ చెంచాతో తినిపించి, మేం తినడం మానేశాక, ఆ గిన్ని తను నాకింది.

చిన్నప్పుడు నాకూ, మా సరసుకీ, ఎలా అనిపించేదంటే, మా అమ్మా నాన్నా దూరే గది వాళ్ళ ఇల్లూ, మేం ముగ్గురం ఉండే వసారా మా ఇల్లూ, అని పించేది. రుక్మిణత్తయ్యా వాళ్ళిల్లు వేరు కదా? అలాగే అనిపించేది మా అమ్మ గది వేపు చూస్తే. ఆ గదిలోకి మేం ఎప్పుడూ వెళ్ళం. ఆ మంచాలు ముట్టుకోం.

మా అమ్మకి మా నాన్న సేవలు నిజమే గానీ, అసలు ఖాళీయే ఉండదని కాదు. వంటలన్నీ పొద్దున్న పూటే చేస్తుంది. రాత్రి వంట కూడా పొద్దున్నే చేసి రాత్రి పొయ్యి మీద వెచ్చబెడుతుంది. పగలు పనంతా అయ్యాక తన గదిలో దూరి తలుపులు బిగించుకుని పరుపుల మంచం మీద సాయంత్రం దాకా నిద్ర పోతుంది.

మా నాయనమ్మకి ఏ పూటా నిద్ర ఉండదు. మా సరసు నాయనమ్మని మరీ విసిగించి చంపుతుంటుంది. నాయనమ్మ నిద్రపోతోంటే మీదకెక్కి తొక్కుతుంది. నాయనమ్మని లేవగొట్టకపోతే దానికి మతి మతిలో ఉండదు.

అయ్యో, అసలేం చెపుతున్నానూ? ఆఁ... ఒక రోజు పని బాలమ్మ రాలేదు కదా? నాయనమ్మ వాకిళ్ళు ఊడుస్తూ చెట్ల వేపు ఊడుస్తోంది. సరసు నిద్ర పోతోంది. నేను, నాయనమ్మ ఇచ్చిన జాంపింది కొరుక్కు తింటూ వాకిట్లోకి పోతున్నాను. మా అమ్మ వెనక నించి నన్ను పిల్చి ఏదో అంది. నాకు భయం వేసింది. ఆగకుండా నేను వాకిట్లోకే పరిగెత్తాను. మా అమ్మకి కోపం వచ్చేసింది. నా వెనకాల అంగలేసుకుంటూ వచ్చేస్తోంది. అది చూసి నేను నాయనమ్మ వేపు ఇంకా పరిగెత్తాను. నన్ను మధ్యలోనే పట్టేసుకుంది అమ్మ. అప్పటికే పట్టేసింది నా కుడి తొడ!

పాశం! పాశం! తొడ పాశం!

"పిలుస్తోంటే వినకుండా పరిగెత్తుతావా లంజ ముండా!" అంటూ తొడ తిప్పేస్తోంది. నేను కెవ్వున అరిచేప్పటికి మా నాయనమ్మ మా వేపు వెంటనే చూసింది. చేతిలో చీపురుతో పడుతూ లేస్తూ వచ్చి ఆ చీపురుతో మా అమ్మ చేతి మీద కొట్టేసింది. అయినా మా అమ్మ నా తొడ వదల్లేదు. ఇంకా ఇంకా మెలికలు తిప్పేస్తోంది. "ఈ దరిద్రం ముండకి రోజూ నాలుగు తొడపాశాలు పెడితే గానీ బుద్ధి రాదు. దీనికి పుట్టగానే నోట్లో వడ్ల గింజ పడెయ్యాల్సింది" అంటూ తొడని నలిపేసి నలిపేసి అప్పుడు వదిలింది.

నేను నేల మీద బోర్లాపడి విలవిల్లాడి పోతోంటే, నా గౌను లేచిపోయి, వీపు కనపడి మా అమ్మ నా

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/book/Donga+Tallidandruluntaru+Jagratta

* * *